సాక్షి వనపర్తి

బుధవారం : 17 : ఏప్రిల్ : 2024



వైభవంగా మాస కల్యాణం

సిర్సనగండ్లలో సీతారామచంద్రస్వామి మాస కల్యాణం వైభవంగా జరిగింది.

వివరాలు IIలో ▸



ఫైర్ మాక్‌డ్రిల్

శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో మంగళవారం ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం

43.7 /23.4

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు వడగాలులు వీచే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

అనన్య.. ప్రతిభ

సివిల్స్‌లో ఆలిండియా 3వ ర్యాంకు సాధించిన పాలమూరు బిడ్డ



ఉమ్మడి జిల్లాలోనే మొదటిసారి సివిల్స్‌లో టాప్‌టెన్‌లో నిలిచిన దోనూరు అనన్యరెడ్డి

- తాత దిశానిర్దేశంతో సివిల్స్ వైపు అడుగులు
- సొంతంగా ప్రిపరేషన్.. మొదటి ప్రయత్నంలోనే విజయం
- సొంతూరు పొన్నకల్.. బాల్యమంతా మహబూబ్‌నగర్‌లోనే..

ఆమె పుట్టింది మధ్య తరగతి కుటుంబంలోనే.. కానీ, సాధించిన ఘనత మాత్రం అసామాన్యమైనది. కేవలం తాత చెప్పిన మాటలనే.. తన జీవితానికి మార్గనిర్దేశకంగా మార్చుకుంది. అది మొదలు చిన్నప్పటి నుంచే చదువే ధ్యాసగా ముందుకు సాగింది. తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో లక్ష్యం వైపు అడుగులు వేసింది. పదో తరగతి పూర్తయిన వెంటనే ఇంటర్ దశ నుంచే సివిల్స్‌పై దృష్టి సారించింది. చదువులోనే అన్ని ఆనందాలు వెతుక్కొని.. సివిల్స్‌లో అసామాన్యమైన ప్రతిభ చాటింది. సొంతంగా చదువుకొని మొదటి ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో మూడో ర్యాంకు సాధించి.. దేశంలో పాలమూరు కీర్తిని చాటింది అడ్డాకుల మండలం పొన్నకల్‌కు చెందిన దోనూరు అనన్యరెడ్డి.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ అడ్డాకుల: యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో పాలమూరు బిడ్డ సత్తాచాటింది. సివిల్స్- 2023 ఫలితాల్లో జిల్లాకేంద్రానికి చెందిన దోనూరు అనన్యరెడ్డి జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. ఆమె ఒక సాధారణ కుటుంబంలో జన్మించి సివిల్స్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలన్న ఆశయం ఉన్న ఆమె బాల్యమంతా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోనే గడిచింది. ఆమె ఐఏఎస్ కావాలన్న కలలకు స్ఫూర్తినిచ్చింది తాత కృష్ణారెడ్డి ఆయన సలహాలు, సూచనలతో చిన్నప్పటి నుంచి సివిల్సే లక్ష్యంగా చదువుకున్నట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఎలాంటి శిక్షణ లేకుండా.. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ జాతీయస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది.

ఇంటర్ ప్రారంభం నుంచే..

అనన్య ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మహబూబ్‌నగర్‌లోని గీతం పాఠశాలలో చదివారు. ఎస్సెస్సీలో మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ ప్రారంభం నుంచి ఐఏఎస్ వైపు అడుగులు పడ్డాయి. దీంతో ఆమెను హైదరాబాద్‌లోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో చేర్చారు. ఇంటర్ పూర్తయ్యాక ఢిల్లీలోని మిరిండా హౌస్ కళాశాలలో ఏబీ (బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్)లో చేరారు. డిగ్రీ పూర్తయ్యాక 2020 నుంచి పూర్తి స్థాయిలో సివిల్స్ ప్రిపరేషన్‌పై దృష్టిపెట్టారు. ఢిల్లీలోనే పీజీ చదువుతూ సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సివిల్స్‌లో ఆప్షనల్ సబ్జెక్టులుగా ఆంత్రపాలజీని ఎంపిక చేసుకున్నారు. ఈ ఒక్క ఆంత్రపాలజీ కోసం ఆన్‌లైన్‌లోనే శిక్షణ తీసుకున్నారు. దీంతో మిగతా సబ్జెక్టులు అన్ని కూడా సొంత ప్రిపరేషన్‌తో ముందుకు సాగారు. ప్రతిరోజు 12 నుంచి 14 గంటల పాటు సిద్ధమయ్యాయని చెప్పారు.

కుటుంబ నేపథ్యం ఇది..

అన్యనరెడ్డి తల్లిదండ్రులది మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకల్ మండలం పొన్నకల్ గ్రామం. అయితే చాలా సంవత్సరాల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్‌కాలనీలో స్థిరపడ్డారు. తండ్రి సురేష్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా.. తల్లి మంజులత గృహిణి. అనన్యరెడ్డికి ఒక చెల్లెలు చరణ్య ఉంది. ప్రస్తుతం ఆమె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అనన్యరెడ్డి తాత కృష్ణారెడ్డి స్టాటిస్టికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా ఉన్న క్రమంలో ఆమెకు ఐఏఎస్ కావాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు. తాత సలహాతో పాటు సమాజసేవ చేయాలనే తలంపుతో ఆమె సివిల్స్‌కు ప్రిపేర్ అయినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు.



తల్లిదండ్రులతో అనన్యరెడ్డి (ఫైల్)

సంతోషంగా ఉంది..

మా కూతురు సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతో శ్రమించింది. మొదటి ప్రయత్నంలోనే ఆమె సివిల్స్‌లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం గర్వంగా ఉంది. మా నమ్మకాన్ని నిలబెట్టింది.

– మంజులత, అనన్యరెడ్డి తల్లి

లక్ష్యం చేరుకుంది..

అనన్యరెడ్డి అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ ర్యాంకు సాధించడం చాలా గర్వంగా ఉంది. ఆమె తాత కృష్ణారెడ్డి సివిల్స్ సాధించేందుకు దిశానిర్దేశం చేశారు. దీంతో అప్పటి నుంచి ఆమె సివిల్స్‌కు సిద్ధమైంది. చదువు విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. చాలా సమయం చదువులపైనే గడిపేది.

– సురేష్‌రెడ్డి, అనన్యరెడ్డి తండ్రి

సొంత ప్రిపరేషన్

సివిల్స్‌కు సిద్ధమయ్యే క్రమంలో అనన్యరెడ్డి సొంత ప్రిపరేషన్‌పైనే ఎక్కువగా దృష్టిపెట్టారు. ప్రతి రోజు 12 గంటల నుంచి 14 గంటలపాటు చదువుకునేవారు. సబ్జెక్టులో ప్రతి అంశాన్ని నోట్‌గా రాసుకునే అలవాటు ఉండటంతో శిక్షణ తీసుకోవాల్సిన అవసరం రాలేదు. చాలా సులువుగా లక్ష్యాన్ని చేరుకుని ప్రణాళిక ప్రకారం నిర్దేశిత సమయంలో సిలబస్‌ను పూర్తిచేసే విధంగా ఆమె ప్రిపరేషన్ కొనసాగించారు. సివిల్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలకు హాజరయ్యే క్రమంలో సీనియర్ల సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడినట్లు అనన్య రెడ్డి చెప్పారు.

గర్వకారణం..



మా కుటుంబానికి చెందిన దోనూరు అనన్యరెడ్డి యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించడం చాలా గర్వంగా ఉంది. ఆమె తండ్రి సురేష్‌రెడ్డి తన ఇద్దరు కుమార్తెల చదువుల కోసం గ్రామాన్ని వదిలి మహబూబ్‌నగర్‌లో స్థిరపడ్డారు. తండ్రి ఆశయాన్ని నెరవేర్చిన అనన్యరెడ్డికి శుభాకాంక్షలు.

– దోనూరు నాగార్జున్‌రెడ్డి, ఎంపీపీ, పొన్నకల్ గ్రామం

జాతీయస్థాయిలో గుర్తింపు



యూపీఎస్సీ ఫలితాల్లో దోనూరు అనన్యరెడ్డి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించి పొన్నకల్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చింది. చదువులో రాణించి ఉన్నత స్థాయి ఉద్యోగానికి ఎంపికవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరొచ్చని నిరూపించింది.

– దోనూరు విజయకుమార్‌రెడ్డి, పొన్నకల్

పొన్నకల్‌లో సంబరాలు

అనన్యరెడ్డి యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పొన్నకల్‌వాసికి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు రావడంతో కుటుంబసభ్యులు, బంధువులు అనన్యరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనన్యరెడ్డి తండ్రి సురేష్‌రెడ్డి గ్రామంలో కొన్నాళ్లపాటు వ్యవసాయం చేశారు. 20 ఏళ్ల కిందట ఇద్దరు కుమార్తెల చదువుల కోసం మహబూబ్‌నగర్ వెళ్లి స్థిరపడ్డాడు. అక్కడే వ్యాపారాలు చేస్తూ కుమార్తెలను చదివించారు.

మెరిసిన ఆత్మకూర్ ఆణిముత్యం

సివిల్స్‌లో 278 ర్యాంకు సాధించిన ఎహ్తెదా ముఫస్సీర్

ఆత్మకూర్: యూపీఎస్సీ ఫలితాల్లో ఆత్మకూర్‌కు చెందిన ఎహ్తెదా ముఫస్సీర్ ప్రతిభచాటింది. ఎలాంటి కోచింగ్ లేకుండానే ఆలిండియా 278 ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికై ంది. ఆత్మకూర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సయ్యద్‌ఖాసిం కుమారుడు ఇబ్రహిం ఖలీల్‌కు ఇద్దరు కుమార్తెలు రుఫియా, ఎహ్తెదా ముఫస్సీర్, కుమారుడు సయ్యద్ తఫస్సూల్ ఉన్నారు. రెండో కుమార్తె ఎహ్తెదా ముఫస్సీర్ పదో తరగతి వరకు మహబూబ్‌నగర్‌లోని ఆకృతి పాఠశాలలో చదివి 2014లో 10/10 గ్రేడ్‌ను సాధించిన ఆమె.. ఇంటర్ బైపీసీ సిరి కళాశాలలో పూర్తి చేసి 987 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. అనంతరం ఢిల్లీలోని లేడి శ్రీరాం కళాశాలలో పొలిటికల్ సైన్స్ డిగ్రీ విద్యను 2020లో పూర్తి చేసింది. తర్వాత సోదరి రుఫియాతో కలిసి ఎహ్తెదా ముఫస్సీర్ ఇంట్లోనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యి.. 2023లో నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలకు హాజరైంది. ఈ క్రమంలో మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 278 ర్యాంకు సాధించగా.. ఆమె సోదరి రుఫియా ఫలితాల్లో స్వల్ప తేడాతో వెనకబడిపోయింది. ఎహ్తెదా అత్యుతమ ర్యాంకు సాధించడంతో ఆత్మకూర్‌లో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



తాతయ్యే స్ఫూర్తి..

'మా తాతయ్య సయ్యద్‌ఖాసీం రిటైర్డు ఉపాధ్యాయుడు. తాను, తన కుమారులు ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతున్నామని.. మీరు ఇంకా గొప్పస్థాయిలో కలెక్టర్ కావాలని తరచుగా చెప్పేవారు.' అని ఎహ్తెదా చెప్పారు. దీంతో పదో తరగతి నుంచే గట్టిగా నిర్ణయించుకొని సివిల్స్ వైపు అడుగులు వేశానని పేర్కొన్నారు. 278 ర్యాంకు రావడంతో మా తాతయ్య కల సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు. పేదలకు అండగా నిలబడలన్నదే తన లక్ష్యం అని వివరించారు.

న్యూస్‌రీల్

బస్సులు కేటాయించాలని వినతి



వనపర్తిటౌన్: నిజాం కాలంలో ఏర్పాటైన వనపర్తి ఆర్టీసీ డిపోలో రవాణా సేవలు విస్తృతం చేసేందుకు చొరవ చూపాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి లేఖ అందించారు. డిపోకు 26 బస్సులు కేటాయించాలని, ప్రజలకు ఆర్టీసీ సేవలను మరింత చేరువ చేసేందుకు బస్సుల కేటాయింపు అనివార్యమని తెలిపారు. అదేవిధంగా పాత బస్టాండ్ కమర్షియల్ ప్రాంతంలో ఉందని.. వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పాత బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తే ఆదాయం సమకూరడమేగాక ప్రజలకు వ్యాపార సముదాయం మరింత చేరువ అవుతుందని వివరించారు.

రూ.80 వేల ఔషధాలు సీజ్



వనపర్తిటౌన్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే మెడికల్ దుకాణాలు, ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు రష్మి, రబీయా హెచ్చరించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల మెడికల్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. శ్రీసాయి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.80 వేల మందులు సీజ్ చేసి ఎఫ్‌ఎస్‌ఎల్ ల్యాబ్‌కు పంపినట్లు వివరించారు.

బస్టాండ్లలో వసతుల కల్పనపై దృష్టి



అమరచింత: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ వి.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ను ఆయన పరిశీలించి వసతులపై ఆరా తీశారు. కూర్చోడానికి బేంచీలు, మహిళలకు మరుగుదొడ్లు, ప్రహరీ లేదనే ప్రయాణికులు వివరించారు. జిల్లాకేంద్రం నుంచి ఆత్మకూర్ వరకు నడుస్తున్న షటిల్ బస్సులను అమరచింత వరకు కొనసాగించాలని స్థానిక నాయకులు కోరారు. అనంతరం డీఎం మాట్లాడుతూ.. డిపో పరిధిలోని అన్ని బస్టాండ్లను సందర్శిస్తున్నామని, కనీస సౌకర్యాల కల్పనకు కావాల్సిన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు వివరించారు. ప్రహరీ నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరయ్యాయని, బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న డబ్బాల తొలగింపునకు సహకరించాలన్నారు. శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట డిప్యూటీ ఆర్‌ఎంఓ లక్ష్మి ధర్మ, డిప్యూటీ ఈఈ పోచయ్య, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ తదితరులు ఉన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు



పెబ్బేరు రూరల్: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టి చూసుకుంటామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేరులో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కృష్ణానదిలో ఉన్న నీటిని రైతులకు ఎలా అందించాలో తమకు తెలుసని.. ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ పెబ్బేరు మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 23న మల్లు రవి నామినేషన్ వేస్తున్నారని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వరకు 12 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకొని గ్రామ కమిటీలు వేశారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, అక్కి శ్రీనివాసులుగౌడ్, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, బీరం రాజశేఖర్ రెడ్డి, శంకర్‌నాయక్, కౌన్సిలర్ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజినీర్‌కు 627వ ర్యాంక్

వెల్దండ: సివిల్స్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెదురుపల్లి ఉమ్మడి పంచాయతీ పోషమ్మగడ్డతండాకు వడ్త్యావత్ యశ్వంత్‌నాయక్ జాతీయ స్థాయిలో 627వ ర్యాంకుతో సత్తాచాటారు. తండాకు చెందిన ఉమాపతి, పద్మ దంపతుల మొదటి కుమారుడు యశ్వంత్. ఇతను ఇంటర్మీడియట్ నారాయణ కళాశాలలో, ఐఐటీ మద్రాస్‌లో మెకానికల్ ఇంజినీయర్ పూర్తిచేశారు. తర్వాత సివిల్స్ సాధించడమే లక్ష్యంగా చదివి.. రెండోసారి ప్రయత్నంలో మెరుగైన ర్యాంకు సాధించాడు. తమ కుమారుడు సివిల్స్ సాధించడంతో తల్లిదండ్రులు పద్మ, ఉమాపతి హర్షం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థి సివిల్స్‌లో ర్యాంక్ సాధించడంతో తండావాసులు, బంధువులు అభినందించారు.



కుమారుడు యశ్వంత్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లి పద్మ

914 ర్యాంకు సాధించిన అనుప్రియ



బాలానగర్: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన నేనావత్ అనుప్రియ యూపీఎస్సీ ఫలితాల్లో 914 ర్యాంకు సాధించింది. సివిల్స్ ఫలితాల్లో గిరిజన కుటుంబానికి చెందిన అనుప్రియ మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన నేనావత్ బల్‌రాంనాయక్ రెండో కూతురు అనుప్రియ. ఈమెకు కొద్ది సంవత్సరాల క్రితమే వివాహం కాగా భర్తతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్.. సమావేశానికి హాజరైన అధికారులు

- కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తిటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు గురువారం నుంచి తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని.. వనపర్తిలో ఉండే అభ్యర్థులు సైతం నాగర్‌కర్నూల్‌లోనే నామినేషన్ వేయాలని సూచించారు. 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని, ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేసేవారు హార్డ్ కాపీలను రిటర్నింగ్ అధికారికి నేరుగా సమర్పించాలన్నారు. అఫ్‌డెవిట్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. ఎన్నికల ప్రచారానికి సమాన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రచార అనుమతులను సహాయ రిటర్నింగ్ అధికారి నుంచి పొందాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.నగేష్, ఆర్డీఓ పద్మావతి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ..

పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు పూర్తిస్థాయిలో సంసిద్ధులుగా ఉండాలని ఎన్నికల అధికారి తేజస్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్‌తో కలిసి నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించి జాబితా సిద్ధం చేయాలని, ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా విడుదల చేయాలన్నారు. ఈసీ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని.. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మే 3 నుంచి 8 వరకు కొనసాగే పోస్టల్ బ్యాలెట్ సెంటర్లు, హోం ఓటింగ్‌కు రూట్ మ్యాప్, భద్రత, పోలింగ్ సిబ్బంది, రవాణా ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీఓ పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు, నోడల్ సి–సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో డబ్బులు చెల్లించాలి..

వరి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని కలెక్టర్ తేజస్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, పంట విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 242 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, మిల్లుల నుంచి రావాల్సిన సీఎంఆర్ సకాలంలో అందించే విధంగా డిప్యూటీ తహసీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. మూడు సీజన్లకు సంబంధించి మిల్లర్లు కార్పొరేషన్‌కు అందించాల్సిన 18 వేల మెట్రిక్ టన్నుల పెండింగ్ ధాన్యాన్ని ఏప్రిల్ 30లోపు పూర్తి చేయాలన్నారు. గతంలో నాసిరకం బియ్యం ఇచ్చిన మిల్లర్లకు నోటీసులు జారీచేసి నాణ్యమైన బియ్యాన్ని సేకరించాలని కోరారు. సమావేశంలో డీఎస్ఓ శ్రీనివాసులు, డీఎం ప్రవీణ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, డీఆర్డీఓ, డీటీలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రజావాణి వినిపిస్తా



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్.. చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తిటౌన్/ఖిల్లాఘనపురం/నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ రూరల్: తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే.. ఢిల్లీలో ఈప్రాంత ప్రజల వాణి వినిపిస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జెడ్పీ మైదానంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తాలలో హమాలీ సంఘం నాయకులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం రాజకీయ ఐక్యవేదిక సదస్సులో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని దళితవాడ, రాజీవ్‌చౌక్, కాశీంనగర్‌లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి కార్నర్ మీటింగ్, ఖిల్లాఘనపురంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఆర్‌ఎస్‌పీ మాట్లాడుతూ మహనీయుల ఆశయసాధన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన ఏడేళ్ల సర్వీస్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రభుత్వంతో కొట్లాడి ఎర్ర బస్సు నుంచి ఎయిర్ బస్సు సౌకర్యం కల్పిస్తానని చెప్పారు. విద్యార్థుల కోసం కొత్త పథకాలు తీసుకురావడమే కాకుండా, వారిలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో ఇక్కడ ఎంపీలుగా గెలిచిన నాయకులు ఎలాంటి సేవలు అందించారో ప్రజలందరికీ తెలుసన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరిగిన 223 రోజుల్లో కేవలం 6 నిమిషాలు మాత్రమే మాట్లాడిన ఎంపీ కొడుకు బీజేపీ అభ్యర్థి అని ఎద్దేవా చేశారు. గతంలో రెండు సార్లు ఎంపీగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఈప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా తనను గెలిపిస్తే, ఈ ప్రాంతాన్ని ప్రపంచ పటంలో నిలుపుతానని హామీ ఇచ్చారు.

- కొనుగోలు కేంద్రాలకు కనీసం గన్నీబ్యాగులు అందించలేని పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. మాయమాటలు చెప్పి, ఓట్లు దండుకోవడం కాంగ్రెస్‌కు వెన్నెతో పెట్టిన విద్య అని అన్నారు. కేసీఆర్ హయాంలో ఖిల్లాఘనపురం మండలానికి సాగునీరందించే పనులను ఒక్క ఏడాదిలోనే పూర్తిచేసినట్లు వివరించారు. విద్యావేత్త ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. సమావేశాల్లో అభిలాష్‌రావు, ప్రత్యూష, ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సామ్యానాయక్, గ్రంథాలయ చైర్మన్ లక్ష్మయ్య, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, లక్ష్మారెడ్డి, కృష్ణయ్య, మంగి విజయ్, ప్రదీప్, ఐతోల్ లక్ష్మయ్య, భాస్కర్‌గౌడ్, గంగాధర్, కరణ్ లాల్, రాంనర్సయ్య, గంగ, మీసాల రాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదువులో వెనకబడ్డానని.. బీటెక్ విద్యార్థి బలవన్మరణం


ఆర్.శ్రీవర్ధన్ (ఫైల్)

కొత్తకోట రూరల్: చదువులో వెనకబడ్డానని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని కానాయపల్లికి చెందిన ఆర్.చంద్రశేఖర్, లావణ్య దంపతుల పెద్ద కుమారుడు ఆర్.శ్రీవర్ధన్(22) హైదరాబాద్‌లోని ఆదిబట్ల నాగర్‌గూల్‌లో ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుడి స్కూటీ తీసుకొని బయటకు వెళ్లాడు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా మృతుడి దగ్గర ఉన్న ఆధార్, కళాశాల గుర్తింపు కార్డుల ఆధారంగా రైల్వే పోలీసులు కళాశాలకు సమాచారం చేరవేశారు. చదువులో మార్కులు తక్కువగా వస్తున్నాయని, ఇదివరకు కొన్ని సబ్జెక్టులు మిగిలిపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని మంగళవారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడి మృతి

రాజోళి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన రాజోళి మండలం పెద్ద తాండ్రపాడులో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీశ్వర్ వివరాల మేరకు.. పెద్ద తాండ్రపాడుకు చెందిన గొల్ల మల్లేష్ కుమారుడు భరణి (16) సోమవారం తన బాబాయ్ పొలంలో ఎరువు తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా.. బాలుడు కూడా ఎక్కాడు. ఈక్రమంలో అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ కిందపడింది. దాన్ని అందుకునే క్రమంలో కిందపడిన భరణిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ హత్యకేసు విచారణ వేగవంతం

నవాబుపేట: మండల కేంద్రంలో చోటుచేసుకున్న మహిళ హత్య కేసు విచారణలో పోలీసులు వేగం పెంచారు. అందులో భాగంగా క్లూస్ టీంలను రంగంలోకి దింపారు. గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న పురుగుల లక్ష్మమ్మ (48)ను లైంగికదాడి చేసి, హతమార్చినట్లు ఆనవాళ్లు లభించడంతో, పోలీసులు ఆ దిశగా విచారణ చేపడుతున్నారు. ఆమెతో సన్నిహితంగా ఉండేవారి వివరాలను ఇప్పటికే సేకరించారు. కాగా, మహిళను హత్యచేసిన తర్వాత ఒంటిపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్ సైతం ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆమె ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసును త్వరలోనే ఛేదిస్తామని.. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

జడ్చర్ల: యువకుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని బంధువులకు అప్పగించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో కొళగుట్ట ప్రాంతంలో యువకుడి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. మృతదేహం దగ్గర లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా ఏపీలోని నంద్యాల జిల్లా ఇంజేడు గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణమూర్తి ఆచారి(26)గా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. అతను కొంత కాలంగా బాలానగర్, హైదరాబాద్‌లోని ఓ ఫార్మ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 2న కంపెనీ పని మీద వైజాగ్ వెళ్తున్నట్లు తోటి మిత్రుడికి చెప్పి గండిమైసమ్మ ప్రాంతంలో అద్దెకు ఉంటున్న రూమ్ నుంచి బయలు దేరాడు. ఈనెల 5 నుంచి ఫోన్‌స్విచ్ ఆఫ్ రావడంతో విచారించగా, ఆచూకీ లభ్యం కాలేదు. కంపెనీ అధికారులను ఆరా తీయగా, తాము ఎక్కడికి పంపలేదని నిర్ధారించారు. ఈలోగా జడ్చర్ల కోళగుట్ట వద్ద మృతదేహం లభించింది. అతని మామ శ్రీధరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుడిసె దగ్ధం



అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్దాపూర్‌లో మంగళవారం గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య భార్య తో కలిసి మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా, అప్పటికే పూర్తిగా కాలి గుడిసెలోని ఆహార పదార్థాలు, దుస్తులు, దాచుకున్న డబ్బులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. నిరాశ్రయులైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కూతురు వివాహానికి దాచుకున్న డబ్బు, బంగారు వస్తువులు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల మాస కల్యాణం


స్వామి, అమ్మవార్లకు మాస కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

- సిర్సనగండ్లలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- నేడు కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

చారకొండ: అపర భద్రాద్రి సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మాస కల్యాణానికి ముందు సిర్సనగండ్ల గ్రామం నుంచి ఆలయం వరకు భక్తులు, గ్రామస్తులు స్వామివారి విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా గుట్టపై ఆలయానికి చేరుకున్నారు. అనంతరం 12 గంటలకు సీతారాముల మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. మాస కల్యాణ వేడుక 3 గంటల పాటు అర్చకుల మంత్రోచ్ఛరణాల మధ్య తంతు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకను తిలకించారు. ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డీటీ విద్యాధరి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు సిర్సనగండ్లకు చెందిన పిన్నపురెడ్డి వెంకట్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు మురళీధర్‌శర్మ, లక్ష్మణశర్మ, వేణుశర్మ, కోదండరామశర్మ, రఘుశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

వేడుకలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నీడనిచ్చే చలువ పందిళ్లు, అవసరమైన చోట టెంట్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే కల్యాణ మండపం ఎదురుగా దాదాపుగా 10 వేల మంది భక్తులు కూర్చునేలా, కల్యాణ మండపం చుట్టూ వేడుకను 20 వేల మంది భక్తులు తిలకించేలా సదుపాయాలు కల్పిస్తున్నారు. వీఐపీల కోసం గుట్టపైన పార్కింగ్ స్థలాలు చదును చేశారు. కల్యాణం రోజు వృద్ధులు, మెట్ల నుంచి రాలేని వారికి ఆలయం ఆధ్వర్యంలో గుట్టపైకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చైర్మన్ రామశర్మ చెప్పారు.


భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నేడు సీతారాముల కల్యాణం

శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వం తరపున అమ్మ, స్వామివార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తంబ్రాలు అందించనున్నారు. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా గట్టి బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.


సిర్సనగండ్లలో మాస కల్యాణానికి హాజరైన భక్తులు

ధరణి ఆపరేటర్‌పై బదిలీ వేటు

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అవినీతిపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'పైరవీకారులదే రాజ్యం' కథనానికి కలెక్టర్ స్పందించారు. భూరిజిస్ట్రేషన్‌లలో చేతివాటం ప్రదర్శిస్తున్న ధరణి ఆపరేటర్‌పై బదిలీ వేటు వేశారు. కాగా, 'సాక్షి'లో ప్రచురితమైన కథనం ప్రజలు, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందిస్తూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమన్నారు. ఇదిలా ఉంటే, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా భూరిజిస్ట్రేషన్‌ల బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్‌లకు అప్పగించారని.. అదే కోవలో తన లాగిన్‌ను డీటీకి అప్పగించినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఏవైనా సమస్యలు ఉంటే, నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పైరవీకారుల ప్రమేయాన్ని సహించమని స్పష్టంచేశారు.

కురుమ యాదవుల డీడీలు తిరిగిస్తాం

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

హన్వాడ: గత ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల కోసం కురుమ యాదవులు చెల్లించిన డీడీలను తిరిగి చెల్లించేందుకు కృషి చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నదర్‌పల్లి సమీపంలోగల ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను చేపట్టిన పాలమూరు న్యాయయాత్రకు హన్వాడ మండలంలో అపూర్వ స్పందన వచ్చిందన్నారు. అదే ఊపుతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు 20వేల మెజార్టీ వస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఎన్నికల అనంతరం కులగణన చేపట్టడంతో పాటు ముదిరాజ్‌లను బీసీ–ఏ లోకి మార్చే ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిందేమీలేదన్నారు. ఉత్తరాదిలో ఆ పార్టీ శకం ముగిసిపోయిందని.. 170 – 180 సీట్లకే పరిమితమవుతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. ఈసారి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జిల్లాకు రూ. 5వేల కోట్లు మంజూరు చేశారని.. వచ్చే ఐదేళ్లలో రూ. 50వేల కోట్ల అభివృద్ధి జరగబోతుందని తెలిపారు. జిల్లా నుంచి వంశీచంద్‌రెడ్డిని గెలిపించి, సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఓబెదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, ఎస్పీ వెంకటేష్, మహేందర్, సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీను, రాజునాయక్, వెంకటయ్య, శ్రీశైలం, ఎల్లప్ప పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్ కేంద్రం వద్ద ఫైర్ మాక్‌డ్రిల్


భూగర్భ కేంద్రం పీఏటీ వద్ద ఫైర్ సూట్ ధరించి మంటల్లో నడుస్తున్న ఫైర్ సిబ్బంది

దోమలపెంట: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రం ప్రవేశ మార్గం పీఏటీ వద్ద మంగళవారం ఫైర్ సిబ్బంది ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్రంలోని విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల వద్ద ఉండే ప్యానల్ బోర్డులలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినప్పుడు ప్యానల్ బోర్డు స్విచ్‌లను ఆఫ్ చేయడం కోసం ఫైర్ ప్రూఫ్ సూట్ ధరించి మంటల్లో వెళ్లి స్విచ్ ఆఫ్ ఎలా చేస్తారో ఫైర్ సిబ్బంది ప్రదర్శించారు. దీనికి సంబంధించిన వివరాలను కేంద్రం సేఫ్టీ అధికారి డీఈ శ్రీకుమార్‌గౌడ్ తెలిపారు. సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్)రవీంద్రకుమార్, డీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్పీఎఫ్ ఆర్ఐ సూర్యారావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున, ఫైర్ మరియు ఓఅండ్ఎం స్టాఫ్ పాల్గొన్నారు.

బొక్కల ఫ్యాక్టరీ తనిఖీ

మహబూబ్‌నగర్ రూరల్: భూత్పూర్– మహబూబ్‌నగర్ రూరల్ మండలాల పరిధిలోని తాటికొండ, గాజులపేట గ్రామాల శివారులో ఏర్పాటు చేసిన బొక్కల ఫ్యాక్టరీని మంగళవారం కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి సాహితిప్రియ తనిఖీ చేశారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనను భరించలేక కొంతకాలం కిందట ఫ్యాక్టరీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మూసివేయాలని డిమాండ్ చేస్తూ.. ఫ్యాక్టరీ ముందు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అలాగే ఫ్యాక్టరీని మూసివేయాలని కోరుతూ కలెక్టర్ రవినాయక్‌కు వినతి అందజేశారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలికి ప్రజల డిమాండ్ మేరకు లేఖ రాశారు. కలెక్టర్ లేఖను పరిగణలోకి తీసుకున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారి బొక్కల ఫ్యాక్టరీని తనిఖీ, విచారణ నిమిత్తం పంపారు. ఆమె ఫ్యాక్టరీని సందర్శించి, ఫ్యాక్టరీని క్షుణంగా పరిశీలించారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, కాలుష్యంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ప్రజలు తమ గోడు వెల్లబోసుకున్నారు. విచారణలో తన దృష్టికి వచ్చిన వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులకు నివేదిస్తానని, తదుపరి చర్యలు వారు తీసుకుంటారని ఆమె వెల్లడించారు.

సంకాపురం శివారులో అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోతున్న పంపు సెట్లు


మంటలను ఆర్పుతున్న రైతులు

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని సంకాపురం గ్రామ శివారులో మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వ్యవసాయ పంపుసెట్లు, పైపులు కాలిపోయాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రైతులు పంట పొలాలకు సాగునీరు అందించేందుకు గతంలో చెక్ డ్యాంలో గుంతలు తవ్వి, చెలిమలు ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా పంటపొలాలకు సాగునీటిని అందించేందుకు పవర్ మోటార్లను, పంపుసెట్లను అమర్చుకున్నారు. అక్కడి నుంచి పంట పొలాల వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నారు. అనుకోకుండా చెలరేగిన మంటల్లో మొత్తం 22 పంపుసెట్లు, పైపులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


మృతదేహం కోసం వెతుకుతున్న ఎన్డీఆర్ఎఫ్ బలగాలు


లక్ష్మణ్(ఫైల్)

బిజినేపల్లి: వట్టెం రిజర్వాయర్ కోరిల్లో ఈత కోసమని వెళ్లిన లక్ష్మణ్(18) ఈ నెల 13న మధ్యాహ్నం గల్లంతయ్యాడు. దీంతో అదేరోజు సాయంత్రం లక్ష్మణ్ తండ్రి ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ నాగశేఖర రెడ్డి విచారణ చేపట్టి మృతదేహం కోసం నాలుగు రోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా.. మంగళవారం ఉదయం ఆ యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహం బయటికి రాగానే కుటుంబ సభ్యులు, వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహం బయటికి తీసి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

హన్వాడలో బోర్‌వైర్ల చోరీలు

ఎత్తుకెళ్లిన వైర్లు కాలుస్తూ.. పట్టుబడిన యువకులు


హన్వాడ పోలీస్ స్టేషన్‌లో స్టార్టర్, వైర్లను ఎత్తుకెళ్లిన యువకులు

హన్వాడ: బోరుబావులకు అమర్చే స్టార్టర్ వైర్లు ఎత్తుకెళ్లి.. ఆ వైర్లను కాల్చి కాపర్‌వైర్‌ను వేరుచేస్తున్న వారిని స్థానికులు పట్టుకుని, దేహశుద్ధి చేసి హన్వాడ పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కొండ వెంకటేష్, పవన్ మండల కేంద్రంలో ఫొటో స్టూడియో, టెంట్‌హౌస్‌లో పనిచేస్తుండే వారు. వీరు చోరీలు చేయడంతో యాజమానులు వీరిని పనిలోంచి తీసేశారు. దీంతో వారు మండల కేంద్రం నుంచి బుద్దారం దారిపొడువునా, హన్వాడ పెద్దచెరువు శివారు ప్రాంతాల్లోని బోరుబావులను ఎంచుకుని స్టార్టర్లు, వైర్లను చోరీలు చేస్తూ.. వస్తున్నారు. సోమవారం రాత్రి చోరీ చేసిన వైర్లను మండల కేంద్రానికి చెందిన బోయ పుల్లయ్య పొలం సమీపంలో వరిగడ్డి వేసి వైరుకు నిప్పుపెట్టారు. అదేరోజు గ్రామంలో పెద్దపీర్ల సవారీ ఉండడంతో పరిసర ప్రాంత రైతులు పీర్ల మొక్కులు చెల్లించుకుని పొలం వద్ద కావలికి వెళ్లారు. మంటలు చెలరేగడాన్ని గుర్తించి సదరు రైతులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా.. యువకులు వైర్లు కాలుస్తూ కనిపించారు. రైతులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రానికే చెందిన యువకులు కావడంతో పోలీసులు వారిని మళ్లీ కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా.. వారిపై ఇంకా కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. పట్టుబడిన యువకులు తాము చోరీకి పాల్పడలేదని చెబుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పనులకు ఆటంకం కలిగిస్తే చర్యలు


కలెక్టరేట్‌కు వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అమరరాజా బ్యాటరీ కంపెనీ పనులను అన్ని అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసి దానికి అనుగుణంగానే పనులు ప్రారంభించారని, ఇప్పుడు పనులకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవినాయక్ హెచ్చరించారు. కొన్ని రోజులుగా అమరరాజా బ్యాటరీ కంపెనీ పనులను నిలిపివేయాలని నిరసన దీక్షలు చేపడుతున్న పరిసర గ్రామాల ప్రజలు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం అంబటిపల్లి, ఎదిర, దివిటిపల్లి, సిద్దాయపల్లి తదితర గ్రామాల ప్రజలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరరాజా బ్యాటరీ కంపెనీకి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయని, మీకు ఏమైనా ఆక్షేపణలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, అలా కాదని పనులకు ఎట్టి పరిస్థితుల్లో ఆటంకాలు కలిగించొద్దని సూచించారు. ఏఎస్పీ రాములు మాట్లాడుతూ అమరరాజా బ్యాటరీ కంపెనీ పనుల విషయంపై కలెక్టర్ పూర్తిస్థాయిలో అనుమతులపై వివరించారని, కలెక్టర్ సానుకూలంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారన్నారు. పనులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఆయా గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'బీసీలను అవమానిస్తున్న పార్టీలకు గుణపాఠం చెబుతాం'



మాట్లాడుతున్న బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు పార్లమెంట్ పరిధిలో బీసీ బిడ్డలకు జరుగుతున్న అవమానాలను బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి బరిలో ఉన్న రెడ్డీలను ఓడగొట్టి బీసీ అభ్యర్థి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నాడన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట సభలో షరతులతో కూడిన తన ప్రసంగంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిస్తే ముదిరాజ్ బిడ్డను ఆగస్టులో మంత్రిని చేస్తానని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం పార్టీ సభ్యత్వం లేని మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి పార్టీలో చేరకముందే క్యాబినెట్ హోదా కల్పిస్తూ.. ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెడ్డీలకు ఒక న్యాయం, బీసీలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. సీఎంకు నిజంగా బీసీలు, ముదిరాజ్‌లపై అభిమానం ఉంటే.. షరతులతో సంబంధం లేకుండా వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకొని మాట నిలుపుకోవాలన్నారు. బీజేపీలో ఆ పార్టీ అభ్యర్థి డీకే అరుణ ఒంటెద్దు పోకడలతో, బీసీలపై తన వైఖరితో చాలా మంది బీసీలు పార్టీని వీడుతున్నారన్నారు. గద్వాల తరహా రాజకీయాలు మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో చెల్లవని, ఈ నియోజకవర్గ పరిధిలోని 65 శాతం బీసీ జనాభాను దృష్టిలో మీరు బీసీల వ్యతిరేకిగా ముద్రపడ్డారని అన్నారు. 'మన ఓటు మనమే వేసుకుందాం' అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు, సభలతో బీసీలందరిని చైతన్య పరుస్తూ.. ఐక్యమత్యంతో బీసీ అభ్యర్థిని పార్లమెంట్‌కు పంపేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, గోపాల్ ముదిరాజ్, రమేష్‌యాదవ్, సవారి సత్యం, రుద్రారం సత్యం, బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు ఒకరోజు జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: ఈవ్‌టీజింగ్ పాల్పడిన వ్యక్తితో పాటు మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అమ్మాయిలపై దురుసురుగా ప్రవర్తించిన తూడుకుర్తికి చెందిన శేఖర్‌పై షీటీం పోలీసులు కేసు నమోదు చేసి నాగర్‌కర్నూల్ జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామయ్య ఎదుట హాజరుపరిచారు. విచారించిన జడ్జి శేఖర్‌కు ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పరిసర ప్రాంతంలో మద్యం తాగివాహనం నడిపిన గగ్గలపల్లికి చెందిన మల్లేష్‌ను పోలీసులు జడ్జి ఎదుట హాజరుపర్చగా, అతనికి ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.2500 జరిమానా విధించారు. ఎవరైనా అమ్మాయిలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

కుటుంబ సభ్యుల మృతిని తట్టుకోలేక వ్యక్తి బలవన్మరణం


కృష్ణయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యులు మృతిచెందడాన్ని తట్టుకోలేక ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తకోటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొత్తకోటకు చెందిన కుమ్మరి తిరుపతయ్య కుమారుడు కృష్ణయ్య (35) గత జనవరి 25న తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో షిర్డీకి బయల్దేరారు. 26న తెల్లవారుజామున ఔరంగాబాద్ జిల్లా వైజాపూర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టడంతో కృష్ణయ్య భార్య వసుధ (26), కుమారుడు శ్రీమాన్ (4) అక్కడికక్కడే మృతి చెందారు. కూతురు లౌక్య, కృష్ణయ్యకు గాయాలయ్యాయి. ప్రమాదంలో భార్య, కుమారుడిని కోల్పోయిన కృష్ణయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మూడు నెలల్లోనే ముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా, కృష్ణయ్య ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	456	72,944
నిఫ్టీ ▽	125	22,148

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,899	△ 13
డోజోన్స్	37,857	△ 122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,166	△ 89
డాక్స్	15,509	△ 328
షాంఘై	3,007	▽ 50
నికాయ్	38,471	▽ 762

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,302	△1,488
బంగారం (99.5 స్వచ్ఛత)	73,008	△1,487
వెండి (కేజీ)	83,213	▽ 239

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.06
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	106.76
€	యూరో	ఎస్‌బీఐ	87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.20	55.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.26	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.38

ఎంఎఫ్ ఆస్తులు రూ. 53.4 లక్షల కోట్లు

- 2023–24లో 35 శాతం జూమ్
- వార్షికంగా రూ. 14 లక్షల కోట్ల జమ
- 17.78 కోట్లకు ఫోలియోల సంఖ్య



న్యూఢిల్లీ: దేశీయంగా మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 35% జంప్ చేశాయి. రూ. 53.4 లక్షల కోట్లను తాకాయి. వార్షికంగా రూ. 14 లక్షల కోట్లమేర ఎగశాయి. ఇందుకు ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, లాభాల పరుగు తీస్తున్న ఈక్విటీ మార్కెట్లు ప్రభావం చూపాయి. వెరసి 2020–21 ఏడాది(41 శాతం వృద్ధి) తదుపరి గరిష్టస్థాయిలో ఎంఎఫ్ ఆస్తులు బలపడినట్లు వార్షిక నివేదికలో ఫండ్స్ దేశీ అసోసియేషన్(యాంఫీ) వెల్లడించింది. ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) పురోగతి.. ఫండ్స్ పరిశ్రమలో పెరుగుతున్న ఇన్వెస్టర్లను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా మార్చి చివరికల్లా ఫోలియోల సంఖ్య 17.78 కోట్లను తాకింది. ఇది సరికొత్త రికార్డు కాగా.. ఇన్వెస్టర్ల బేస్ 4.46 కోట్లకు చేరింది. ఇన్వెస్టర్ల సంఖ్యలో మహిళల వాటా 23 శాతంకావడం గమనార్హం!

సిప్ దన్ను

క్రమబద్ధ పెట్టుబడుల(సిప్) పథకాలను ఇన్వెస్టర్లు ఆదరిస్తుండటంతో వీటి సంఖ్య బలపడుతోంది. దీంతో నెలవారీ నికర పెట్టుబడులు మార్చిలో రూ. 19,300 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదిలో సిప్ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు లభించాయి. ఇది ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని పట్టిచూపుతోంది. అంతేకాకుండా క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులను ప్రతిబింబిస్తోంది. దేశీ ఎంఎఫ్ పరిశ్రమకు గతేడాది మైలురాయివంటిదని యాంఫీ నివేదిక పేర్కొంది. ఏయూఎం చెప్పుకోదగ్గవిధంగా రూ. 14 లక్షల కోట్లమేర పెరిగి సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 53.4 లక్షల కోట్లకు చేరినట్లు వివరించింది. 2022–23లో ఫండ్స్ ఏయూఎం విలువ రూ. 39.42 లక్షల కోట్లు మాత్రమేనని ప్రస్తావించింది. ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఆధారిత పథకాలు తదితరాలలో ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. పరిశ్రమ ఆస్తుల్లో వీటి వాటా 58 శాతంకాగా.. ఫోలియో సంఖ్యలో 80 శాతాన్ని ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఇవన్నీ ఎంఎఫ్‌ల ద్వారా క్యాపిటల్ మార్కెట్లలో పెరుగుతున్న కుటుంబ మదుపును ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేసింది.

ఈక్విటీకే ఓటు

గతేడాది పెట్టుబడుల్లో ఈక్విటీ ఆధారిత పథకాలు 55 శాతం వృద్ధిని అందుకుని ఆస్తులలో రూ. 23.5 లక్షల కోట్లకు చేరాయి. ఇందుకు పెట్టుబడులతోపాటు.. మార్క్‌టు మార్కెట్(ఎంటుఎం) లాభాలు సహకరించాయి. అయితే మరోవైపు రుణ పథకాల ఫండ్స్ 7 శాతమే బలపడ్డాయి. ఏయూఎంలో రూ. 12.62 లక్షల కోట్లకు చేరాయి. అయినప్పటికీ అంతక్రితం రెండేళ్లలో ఆస్తులు తగ్గుతూ వచ్చిన అంశంతో పోలిస్తే మెరుగేనని నివేదిక తెలియజేసింది.

మూడోరోజూ పతనమే

- సెన్సెక్స్ 456 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత
- మూడు వారాల దిగువకు సూచీలు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు



ముంబై: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలతో స్టాక్ సూచీలు మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ, మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 456 పాయింట్లు నష్టపోయి 72,944 వద్ద నిలిచింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 22,148 వద్ద స్థిరపడింది. ఇవి 3 వారాల కనిష్ట స్థాయిలు కాగా.. నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్థమంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 715 పాయింట్లు నష్టపోయి 72,685 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు క్షీణించి 22,125 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఆయిల్, విద్యుత్, వినిమయ, పారిశ్రామిక, కన్జూమర్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు దాదాపు సగం నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.05% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,468 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, డీఐఐలు రూ.2,040 కోట్ల షేర్లను కొనుగోలు చేశాయి.

- ➤ శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- ➤ అమెరికా వడ్డీ రేట్ల వాయిదా అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్ 4%, ఎంఫసీస్ 3.50%, కోఫోర్జ్ 3%, పర్‌సిస్టెంట్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.
- ➤ వెల్త్‌మేనేజ్‌మెంట్, బ్రోకింగ్ కంపెనీల ఏర్పాటుకు బ్లాక్‌రాక్‌తో ఒప్పందం చేసుకోవడంతో జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు 2% లాభపడి రూ.362 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.372 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,733 కోట్లు పెరిగి రూ.2.30 లక్షల కోట్లకు చేరింది.
- ➤ సెన్సెక్స్ మూడు రోజుల్లో 2,094 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో మార్కెట్ విలువలో రూ.7.93 లక్షల కోట్లు మాయమ్యాయి.

రికార్డు కనిష్టానికి రూపాయి

- 83.61కి దేశీ కరెన్సీ విలువ

డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధ ఉద్రిక్తతలతో ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ 5 నెలల గరిష్టానికి బలపడటం ప్రధాన కారణం. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 83.51 వద్ద మొదలైంది. రోజంతా నష్టాల్లో కదలాడి ఇంట్రాడే కనిష్టం(83.61) వద్ద స్థిరపడింది. ఈ ఏడాది మార్చి 22న ఇదే స్థాయి(83.61) వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. వెరసి గడిచిన నాలుగు వారాల్లో దేశీయ కరెన్సీ రెండోసారి జీవితకాల కనిష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

మళ్లీ మెరిసిన పసిడి, వెండి

బంగారం కొత్త రికార్డు రూ. 73,750

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల భయాలతో పసిడి, వెండి పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ధోరణులకు తగ్గట్లు దేశీయంగా వెండి, బంగారం ధరలు మంగళవారం మరో రికార్డు స్థాయిని తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ప్రకారం దేశ రాజధానిలో ఉదయం పసిడి 10 గ్రాముల ధర రూ. 700 పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి అయిన రూ. 73,750ని తాకింది. అదే విధంగా వెండి ధర కూడా కేజీకి రూ. 800 పెరిగి రూ. 86,500 స్థాయిని తాకింది. ఎంసీఎక్స్‌లో జూన్ కాంట్రాక్టు ధర ఇంట్రా–డేలో రూ. 72,927 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లు చూస్తే కామెక్స్‌లో ఔన్సు (31.1 గ్రాముల) పసిడి ధర 15 డాలర్లు పెరిగి 2,370 వద్ద ట్రేడయ్యింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినంత కాలం బంగారం బులిష్‌గానే ఉండనున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు.




కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-4-2024 ఫామ్ ధర...

విశాఖ	419–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	404–00
విజయవాడ	404–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

క్రిసిల్ క్యూ1 లాభం డౌన్

షేరుకి రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: రేటింగ్ దిగ్గజం క్రిసిల్ ఈ ఆర్థిక సంవత్సరం(2024) తొలి త్రైమాసికం(క్యూ1)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చిలో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతంపైగా క్షీణించి రూ. 138 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలం(క్యూ1)లో రూ. 146 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 751 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో రూ. 732 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 539 కోట్ల నుంచి రూ. 563 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. గతేడాది(2023)కిగాను కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 14న డివిడెండ్ చెల్లించనుంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీడీపీ 6.8 శాతం వృద్ధిని సాధించవచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.

క్రిసిల్ షేరు 3% తగ్గి రూ. 4,700 వద్ద ముగిసింది.

సోనీతో విలీనంపై జీ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: సోనీతో విలీన ప్రతిపాదన అమలయ్యేలా ఆదేశాలివ్వాలంటూ ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) ఉపసంహరించుకుంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. షేర్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చే అవకాశాలను ఉపయోగించుకోవడంపై, సోనీపై ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడంపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. సోనీ భారత వ్యాపార విభాగం, జీల్ విలీనంపై కొన్నాళ్లుగా కసరత్తు జరిగినప్పటికీ ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే.

జ్యువెలరీ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

- రూ. 5 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు
- ఏబీసీ డిజిటల్ సూపర్ యాప్ ఆవిష్కరణ



ముంబై: ఆదిత్య బిర్లా గ్రూప్ కొత్తగా జ్యువెలరీ రిటైల్ వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. మంగళవారం ఆదిత్య బిర్లా క్యాపిటల్ డిజిటల్ (ఏబీసీడీ) సూపర్ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ చైర్మన్ కేఎం బిర్లా ఈ విషయాలు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఈ మధ్యే పెయింట్స్ వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు, డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే మూడేళ్లలో 3 కోట్ల మంది పైగా కొత్త కస్టమర్లను చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు బిర్లా వివరించారు. ప్రస్తుతం రుణాలు, బీమా, అసెట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపార విభాగాల ద్వారా ఆదిత్య బిర్లా క్యాపిటల్ సుమారు 3.5 కోట్ల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. సూపర్ యాప్‌లో 22 ఉత్పత్తులు, సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

జాబ్ పాయింట్

ఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్‌లో 4,660 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్‌ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ), కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 4,660
- » పోస్టుల వివరాలు: సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ)–452, కానిస్టేబుల్–4208.
- » ఆర్‌ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, జమ్మూ–శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.
- » అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్‌ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » వయసు: 01.07.2024 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్‌ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ప్రారంభ వేతనం: నెలకు ఎస్‌ఐ పోస్టులకు రూ.35,400. కానిస్టేబుల్ పోస్టులకు 21,700
- » ఎంపిక విధానం: రాతపరీక్ష(సీబీటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 15.04.2024
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:14.05.2024
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in

సింగేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెంలో 327 ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్).. వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 327

పోస్టుల వివరాలు

- » ఎగ్జిక్యూటివ్ కేడర్: మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈ–ఎం), ఈ2 గ్రేడ్–42, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), ఈ2 గ్రేడ్–07.
- » నాన్–ఎగ్జిక్యూటివ్ కేడర్: జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ(జేఎంఈటీ), టీ–ఎస్ గ్రేడ్ సి–100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–09, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ (ఎలక్ట్రికల్), టీ–ఎస్ గ్రేడ్ సి–24, ఫిట్టర్ ట్రైనీ, క్యాట్ 1–47,ఎలక్ట్రీషియన్ ట్రైనీ, క్యాట్ 1–98.
- » అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- » వయసు: గరిష్ట వయసు 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 15.04.2024
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:04.05.2024
- » పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://scclmines.com

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు

ఇండియన్ ఆర్మీ 140 టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో 2025లో ప్రారంభమయ్యే కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 30 (140వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు)
- » కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
- » అర్హతలు: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు లేదా కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- » వయసు: 01.01.2025 నాటికి 20–27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: అప్లికేషన్ల షార్ట్ లిస్టింగ్, స్టేజ్1, స్టేజ్ 2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీలో శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో లెఫ్ట్‌నెంట్ ర్యాంకుతో షార్ట్ సర్వీస్ కమిషన్ లభిస్తుంది. శిక్షణ అనంతరం పర్మనెంట్ కమిషన్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరి తేదీ: 09.05.2024
- » వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in/Authentication.aspx

ఆర్థిక, గణాంక కొలువుల పిలుపు

- » మొత్తం 48 పోస్టులతో ఐఈఎస్/ ఐఎస్ఎస్ నోటిఫికేషన్
- » రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- » ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

కేంద్ర సర్వీసుల్లో ఉన్నత కొలువులు కోరుకునే యువతకు మరో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! యూపీఎస్సీ.. ఐఈఎస్, ఐఎస్ఎస్–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా జూనియర్ టైమ్ స్కేల్‌తో.. పలు శాఖల్లో.. అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాలో కొలువుదీరొచ్చు!! ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ ఉన్నత స్థాయి పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో ఐఈఎస్, ఐఎస్ఎస్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఐఈఎస్/ఐఎస్ఎస్

ఐఈఎస్.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్. ఐఎస్ఎస్..ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల ఆర్థిక సంబంధ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు అవసరమైన నిపుణుల ఎంపికకు యూపీఎస్సీ ప్రతిఏటా నిర్వహించే పరీక్ష.. ఐఈఎస్/ఐఎస్ఎస్.

మొత్తం 48 పోస్టులు

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన ఐఈఎస్/ఐఎస్ఎస్–2024 నోటిఫికేషన్ ద్వారా రెండు విభాగాల్లో కలిపి మొత్తం 48 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హత

- ఐఈఎస్: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉండాలి.
- ఐఎస్ఎస్: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ లేదా ఈ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌గా పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- వయసు: 2024, ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఐఈఎస్, ఐఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో వేయి మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

రాత పరీక్షలు వేర్వేరుగా

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్ష ఐఈఎస్, ఐఎస్ఎస్ అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

వెయి మార్కులకు ఐఈఎస్ రాత పరీక్ష

ఐఈఎస్ రాత పరీక్ష ఆరు పేపర్లలో మొత్తం 1,000 మార్కులకు జరుగుతుంది. అవి.. పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్ 100 మార్కులు, పేపర్–3 జనరల్ ఎకనామిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 జనరల్ ఎకనామిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 జనరల్ ఎకనామిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.

ఐఎస్ఎస్.. రాత పరీక్ష ఇలా

ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1 జనరల్ ఇంగ్లిష్–100 మార్కులు, పేపర్–2 జనరల్ స్టడీస్–100 మార్కులు, పేపర్–3 స్టాటిస్టిక్స్–1(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–4 స్టాటిస్టిక్స్–2(ఆబ్జెక్టివ్), 200 మార్కులు; పేపర్–5 స్టాటిస్టిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 స్టాటిస్టిక్స్–4, 200 మార్కులకు ఉంటాయి. మొత్తం 1000 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్ 3,4 తప్ప మిగతా పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్ పేపర్లకు రెండు గంటలు, డిస్క్రిప్టివ్ పేపర్లకు మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో చివరగా 200 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే.. రాత పరీక్షలో మార్కులు, ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 30
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: 2024, మే 1 నుంచి 7 వరకు
- పరీక్ష తేదీలు: 2024, జూన్ 21 నుంచి
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్
- వెబ్‌సైట్: www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు అకడమిక్‌గా పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా కలిసొస్తుంది.

జనరల్ ఇంగ్లిష్

ఐఈఎస్, ఐఎస్ఎస్ రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. వొకాబ్యులరీని, రీడింగ్ కాంప్రహెన్షన్ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్

ఈ పేపర్ కూడా రెండు సర్వీసులకు ఒకే మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. శాస్త్ర సాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారత దేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి.

జనరల్ ఎకనామిక్స్–1

ఇందులో రాణించడానికి సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్ కోసం లాగ్రెంజ్ వక్ర రేఖ, ఏంజెల్ సూత్రం, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్పకాల–దీర్ఘకాల వ్యయ రేఖలు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఎకనామిక్స్–2

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే పేపర్ ఇది. దీనికోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపైనా దృష్టి పెట్టాలి.

జనరల్ ఎకనామిక్స్–3

ఇందులో ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలు సమ్మిళితంగా ఉంటాయి. ఈ పేపర్‌లో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ తదితర అంశాలపై అవగాహన పొందాలి.



ఐఈఎస్, ఐఎస్ఎస్-2024

ఇండియన్ ఎకనామిక్స్

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ–రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

సబ్జెక్ట్ పేపర్లకు సన్నద్ధత ఇలా

- స్టాటిస్టిక్స్–1 పేపర్‌లో రాణించాలంటే.. పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- స్టాటిస్టిక్స్–2 పేపర్‌లో.. లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్(ఎస్టిమేషన్ ఆఫ్ మీన్ వెక్టార్ అండ్ కో వేరియన్స్ మ్యాట్రిక్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- స్టాటిస్టిక్స్–3 పేపర్‌లో.. శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- స్టాటిస్టిక్స్–4 పేపర్‌లో.. స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్ ,డెమోగ్రఫీ అండ్ వైటల్ చార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్–సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై పట్టుసాధించాలి.
- డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ పేపర్లలో మంచి స్కోర్ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు, వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్, గ్రాఫ్స్ రూకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.